క్లుప్తంగా

ఏపీఆర్‌సెట్‌లో మహిళా వర్సిటీ విద్యార్థుల ప్రతిభ


మొదటి ర్యాంకు సాధించిన చిత్ర శుక్లా

తిరుపతి సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఆర్‌సెట్ ఇటీవల తుది ఫలితాలలో పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థులు ప్రతిభ చూపి తొలి రెండు ర్యాంకులు దక్కించుకున్నారు. చిత్ర శుక్లా మొదటి ర్యాంకు సాధించగా, రెండో ర్యాంకు కావేరి శుక్లా దక్కించుకున్నారు. వీరు ఏపీ పీజీ సెట్‌లోనూ అర్హత సాధించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ డి.భారతి, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

రియల్ ఎస్టేట్ పేరుతో మోసం

తిరుపతి కల్చరల్: రియల్ ఎస్టేట్ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసిన మణికంఠరెడ్డిపై అధికారులు చర్యలు తీసుకొని తాము మోసపోయిన సొమ్మును ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో బాధితులు వి.సాయికృష్ణ, శ్రీకాంత్, పెంచలయ్య, యశోద మాట్లాడారు. రియల్ ఎస్టేట్ పేరిట కోట్ల రూపాయాలు వసూలు చేశాడని ఆరోపించారు. తాము కూడా 25, 10, 15 లక్షలు చొప్పున అతన్ని నమ్మి డబ్బులు ఇచ్చామన్నారు. కాలం గడుస్తున్నా అతను డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. తమ డబ్బులు తమకు ఇవ్వాలని ప్రస్తుతం అడిగితే తమను బెదిరిస్తూ దూషిస్తున్నాడన్నారు. పోలీసు అధికారులు తమ సమస్యలపై స్పందించి సొమ్ములు తీసుకొని మోసం చేస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నాన్‌టీచింగ్ అసోసియేషన్ సభ్యులకు ఘన సత్కారం


అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న మాదిగ ఫెడరేషన్ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ నాన్‌టీచింగ్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడు, కార్యదర్శిగా గెలుపొందిన జి.శ్రీధర్, ఎన్.సుబ్రమణ్యంను మంగళవారం పలువురు ఘనంగా సన్మానించారు. వర్సిటీ పరిపాలనా భవనం వద్ద మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్‌బాబు, అంజన్ బాబు, ఆదిశేషయ్య, జై చంద్ర, ఎంఎస్ఎఫ్ నాయకులు జూనపూడి ఎజ్రా, సురేంద్రబాబు, రామకృష్ణ, వాసుదేవరావు, గోపి, శివయ్య తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి చీనేపల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శిని ఘనంగా సన్మానించారు. అనంతరం వర్సిటీలో బ్యాక్ లాగ్ పోస్టుల ఖాళీలపై చర్చించారు.

పది నిమిషాల్లో బిగ్ బాస్కెట్ వస్తువులు

తిరుపతి కల్చరల్: టాటా వారి బిగ్ బాస్కెట్ ప్రజలకు రోజువారీ నిత్యావసర వస్తువులను మెరుపు వేగంతో కేవలం 10 నిమిషాల్లో డెలివరీ చేసే సేవలను తిరుపతిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బిగ్ బాస్కెట్ తిరుపతి బిజినెస్ హెడ్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం తాజా, గృహ సంబంధిత ఆహార పదార్థాలు మొదలు 10 వేలకు పైగా ఉత్పత్తులను నగరవాసులు ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. వారు ఎంచుకున్న వస్తువులను కేవలం 10 నిమిషాల్లో డెలివరీ చేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి 10 డెలివరీలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కస్టమర్లు ప్లేస్టోర్ యాప్ స్టోర్ నుంచి బిగ్ బాస్కెట్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకొని తమ సేవలను పొందవచ్చని తెలిపారు.

టీటీడీ సీవీఎస్‌ఓకు ఘనంగా వీడ్కోలు


సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్‌కు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

చంద్రగిరి(తిరుచానూరు): టీటీడీ సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్ బదిలీ కావడంతో తిరుచానూరు ఆలయ సిబ్బంది మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. అమ్మవారి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ తన సిబ్బందితో కలసి స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీవారి భక్తులకు సేవ చేసే భాగ్యం దక్కడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. అనంతరం ఆలయ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

భోజనం కోసం విద్యార్థుల క్యూ





అపరిశుభ్ర నిలయాలు

నగరంలోని ప్రభుత్వ బాలబాలికల వసతి గృహాల్లో అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. హాస్టల్ భవనాల పరిసరాలు చెత్తకుప్పలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నాయుడుపేట గురుకుల పాఠశాల ఉదంతం గుణపాఠం చెబుతున్నా అధికారులలో చలనం లేదు. ప్రభుత్వ వసతి సముదాయాల్లో అపరిశుభ్రత, అధికారుల నిర్లక్ష్యంపై ప్రసార మాధ్యమాలలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నా.. నగరంలోని ప్రభుత్వ హాస్టల్స్ పరిస్థితి మెరుగు పడలేదు. నగరంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో ఇదే పరిస్థితి.

– తిరుపతి అర్బన్

- ప్రభుత్వ హాస్టల్స్‌లో అరకొర వసతులు
- అపరిశుభ్ర వాతావరణంలోనే ఆహారం
- పాముల భయంతో బిక్కుబిక్కుమంటున్న పిల్లలు
- దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లు, చెత్తకుప్పలు
- మెనూ మాటే మరచిన అధికారులు
- దుప్పట్లు అందించకపోవడంతో వణుకుతున్న విద్యార్థులు
- ఇదీ నగరంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల దుస్థితి


అపరిశుభ్రంగా గదులు

తిరుపతి చెన్నారెడ్డికాలనీలోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో పరిస్థితి మరీ దారుణం తయారైంది. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు నరకం అనుభవిస్తున్నారంటే అతిశయోక్తికాదు. చలికి వణుకుతున్నా.. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం వడ్డిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు తనిఖీలు పూర్తిగా మరచిపోవడంతో కనీసం ఏ ఒక్క హాస్టల్‌లోనూ మెనూ పాటించిన దాఖలాలు లేవు. ఇంత దారుణంగా హాస్టల్స్ తయారవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లు

మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. బాత్‌రూమ్‌లోకి వెళితే పాచిపట్టి జారి పడుతున్నారు. దీంతో చేసేదిఏమీలేక ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. సమీప ప్రాంతాల్లో చెంతకుప్పలను సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. హాస్టల్స్ సమీప ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. వాటిని తొలగించడంలోనూ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

పాముల భయం

తిరుపతి నగరంలోని చెన్నారెడ్డికాలనీలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ ఉన్నాయి. నాలుగు ఎస్సీ హాస్టల్స్, ఒక బీసీ హాస్టల్ ఉంది. అయితే సమీప ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు విస్తారంగా ఉండడంతో పాముల బెడద తప్పడం లేదు. దీంతో పిల్లలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. ప్రధానంగా వర్షం పడితే పెద్ద ఎత్తున పురుగులు హాస్టల్స్‌లోకి వచ్చేస్తున్నాయని అంతా ఆందోళన చెందుతున్నారు.

తిరుపతి నగరంలో...

ఎస్సీ హాస్టల్స్ –	07
ఎస్సీ హాస్టల్స్ విద్యార్థులు –	1050 మంది
బీసీ హాస్టల్స్ –	08
బీసీ హాస్టల్స్ విద్యార్థులు –	1175 మంది


హాస్టల్‌లో పెట్టాల్సిన మెనూ బోర్డు

నాసిరకం ఆహారం

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు. మరోవైపు ధరలు అధికంగా పెరిగిపోవడంతో నాసిరకం కూరగాయలను వినియోగిస్తున్నారు. దీంతో రోగాల బారిన పడుతారనే ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. పలువురు తల్లిదండ్రులు హాస్టల్స్ వార్డెన్లకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. గత ప్రభుత్వం వారంలో మూడుసార్లు చికెన్, ఆరు సార్లు గుడ్లు అందించేవారు. అయితే అరకొర మాత్రమే పెడుతున్నారని అంతా చర్చించుకుంటున్నారు.

చలికి వణుకుతున్న విద్యార్థులు

దుప్పట్లు ఈ ఏడాది విద్యార్థులకు పంపిణీ చేయలేదు. దీంతో చలికి వణుకుతున్నారు. గత ప్రభుత్వంలో అదనంగా వచ్చిన కొన్ని దుప్పట్లు మిగిలి ఉంటే వాటిని 10 శాతం మందికి పంపిణీ చేశారు. మిగిలిన వారు దుప్పట్ల కోసం ఎదురుచూస్తున్నారు. హాస్టల్స్ జూన్ 13వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వం దుప్పట్లు అందించలేని దుస్థితి నెలకొంది.


హాస్టల్స్ వద్ద పిచ్చి మొక్కలతో కూడిన ముళ్లపొదలు

విద్యార్థులకు సరైన భోజనం పెట్టాలి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాల్సి ఉంది. లేదంటే రోగాలబారిన పడే ప్రమాదం ఉంది. ఆ విషయాన్ని అధికారులు గుర్తించాల్సి ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిన అవసరమైన సరుకులు సమకూర్చుకోవాలి. లేదంటే ఇక్కట్లు పడుతారు. దుప్పట్లు ఇవ్వాల్సి ఉంది. లేదంటే వచ్చేది చలికాలం మా బిడ్డలు ఇబ్బందులు పడుతారు.

– గోవిందయ్య, విద్యార్థి తండ్రి

పౌష్టికాహారం అందించాలి

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. వారంలో మూడుసార్లు చికెన్ భోజనం, ఆరుసార్లు గుడ్డు భోజనం అందించేవారు. అదే పద్ధతిలో ఇవ్వాలి. దోమలు, పాముల బెడద లేకుండా చూడాల్సి ఉంది. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. అలా చేస్తేనే రోగాల నుంచి దూరంగా ఉండడం వీలుంటుంది.

– వెంకటేశ్వర్లు, విద్యార్థి తండ్రి

వసతి గృహాలు అస్తవ్యస్తం


ఒకే గదిలో వంట, మరో వైపు విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం

చంద్రగిరి/పాకాల/చిన్నగొట్టిగల్లు: చంద్రగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ బాలుర వసతి గృహాలపై సరైన నిఘా లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. చంద్రగిరి మండలంలో 9 ప్రభుత్వ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో భోజనశాలలో ముద్దగట్టిన అన్నం, నీళ్ల సాంబారు విద్యార్థులకు వడ్డిస్తున్నారు. దీంతో ఆ భోజనం తినలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్ అద్దె భవనంలో ఉండడంతో వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ 120 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులు సకాలంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు కేవలం రెండు మాత్రమే అందుబాటులో ఉండగా, ఐదు మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నపాటి గదిలో 10 మంది విద్యార్థులు పైగా ఉండాల్సి రావడంతో చదువుకోవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. సరైన సిబ్బంది లేక ఒకే వ్యక్తి వంట మనిషి, కామాటి, వాచ్‌మెన్‌గా పనిచేయాల్సి వస్తోంది. అదే విధంగా బీసీ హాస్టల్‌లో 220 మంది విద్యార్థులు ఉండగా కేవలం నాలుగు మరుగుదొడ్లు ఉన్నాయి. హాస్టల్‌కు కాంపౌడ్ వాల్ లేకపోవడంతో తరచూ విష సర్పాలు వస్తున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలికల వసతి గృహాల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో ఒకే గదిలో ఓ వైపు వంట చేయగా, మరోవైపు విద్యార్థులకు ఫ్లెక్సీడ్‌తో గదిని ఏర్పాటు చేయడం విస్మయానికి గురి చేస్తోంది. పాకాలలోని ఎస్సీ హాస్టల్ భవనం పైకప్పు పెచ్చులూడడంతో ప్రమాదకరంగా మారింది. బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్డికి డోర్ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. స్నానపుగదుల్లో పైపులు మరమ్మతులకు గురికావడంతో వృథాగా నీళ్లు పోతున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. చిన్నగొట్టిగల్లు మండలం ఎస్సీ హాస్టల్ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణాన కూలుతాయో తెలియక విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని విద్యార్థులు వాపోతున్నారు. నీటి సౌకర్యం కూడా లేదు.

బోరు నీళ్లే దిక్కు

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు తాగేందుకు బోరు నీరే దిక్కుగా మారింది. గతంలో కొన్ని హాస్టళ్లలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఉండేది. అయితే నిర్వహణ భారంగా మారడంతో అధికారుల చేతులెత్తేశారు. దీంతో హాస్టల్ ప్రాంగణంలోని బోరు ద్వారా విద్యార్థులు నీళ్లను తాగుతున్నారు. మరికొన్ని చోట్ల వార్డెన్లు బోరు నీటిని వేడి చేసి ఇస్తుండడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


పిడసకట్టిన అన్నం


సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

చంద్రగిరి ఎస్సీ హాస్టల్‌లో సుమారు 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఒక్క వాచ్‌మెన్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులకు వంట చేయడానికి, కామాటి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయి. దీనిపై ఉన్నాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సిబ్బందిని నియమిస్తామని అధికారులు తెలిపారు.

– బాబు, ఎస్సీ హాస్టల్ వార్డెన్, చంద్రగిరి

బాత్‌రూంలో నీళ్లు రావడం లేదు

కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తే బాత్‌రూంలలో నీళ్లు రావడం లేదు. దీంతో బకెట్‌లతో నీళ్లను తీసుకెళ్లాల్సి వస్తోంది. బాత్‌రూంలు పూర్తిగా పాడయ్యాయి. సకాలంలో పాఠశాలలకు వెళ్లాలంటే ఆలస్యం అవుతోంది. దీనిపై వార్డెన్‌కు సైతం ఫిర్యాదు చేశాం. అయినా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు.

– వెంకటేష్, 10వ తరగతి విద్యార్థి

దుర్గంధం తట్టుకోలేపోతున్నాం

హాస్టల్‌లో భోజనం చాలా నాణ్యతతో అందిస్తున్నారు. అయితే హాస్టల్ బాత్‌రూంలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో అని భయంగా ఉంది. వెంటనే వాటిని మూసివేయాలి. బాత్‌రూంలో నుంచి వచ్చే దుర్గంధం భరించలేక ఒక్కోసారి ముక్కు మూసుకుని భోజనం చేస్తున్నాం.

– బాలాజీ ఆచారి, 7వ తరగతి విద్యార్థి

టీడీఆర్‌పై ఆరోపణలేనా.. ఆధారాలున్నాయా?




అధికారులతో సమీక్షిస్తున్న నగర మేయర్ డాక్టర్ శిరీష, మీడియాతో మాట్లాడుతున్న మేయర్

- కార్పొరేటర్ల ఫిర్యాదులకు తొలి ప్రాధాన్యమివ్వండి
- ఫాగింగ్, బ్లీచింగ్‌పై దృష్టి సారించండి
- అన్ని శాఖల అధికారులతో మేయర్ డాక్టర్ శిరీష సమీక్ష

తిరుపతి తుడా: టీడీఆర్ బాండ్లపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, అవి ఆరోపణలతోనే ఆగిపోతున్నాయే తప్ప ఆధారాలేమైనా ఉన్నాయా అని నగర మేయర్ డాక్టర్ ఆర్ శిరీష అధికారులను ప్రశ్నించారు. కమిషనర్ అదితిసింగ్‌తోపాటు అన్ని శాఖల అధికారులతో మంగళవారం మేయర్ శిరీష సమీక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిజాలను నిగ్గు తేల్చాల్సిన బాధ్యత అధికారులదేనని, ఇందుకు సంబంధించి సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆమె కమిషనర్‌ను కోరారు. కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చే విజ్ఞప్తులు, అధికారులకు ప్రజలు విన్నవిస్తున్న అన్ని సమస్యలకు తొలి ప్రాధాన్యమిచ్చి వాటిని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కౌన్సిల్ నిర్వహణలో ప్రొటోకాల్ పాటించాలని, ఆ దిశగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం అమలు చేసేందుకు ఎక్కడా ఫాగింగ్, బ్లీచింగ్ చేసినట్టు కనిపించడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్ని ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి, ఏ రోజు ఎక్కడెక్కడ ఫాగింగ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్ని లీటర్లు డీజిల్ వినియోగిస్తున్నారో... ఎవరు పర్యవేక్షిస్తున్నారో పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో ఆమె సుదీర్ఘంగా సమీక్షించారు. ఎస్ఈ మోహన్, ఏసీ చరణ్ తేజ్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, కేఎల్ వర్మ, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, ఎంఈ వెంకటరామిరెడ్డి, సెక్రటరీ రాధిక, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలపై సమీక్ష

పాకాల: ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్షించారు. మంగళవారం ఆలయ ఆవరణలో అధికారులు, ఉభయదారులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని, ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గట్టి భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సిబ్బందితో వైద్య సేవలు కూడా అందించేలా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని మంగళవారం మాజీ కేంద్ర మంత్రి సుబోధ్‌కాంత్ షాయ, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

తిరుపతి కల్చరల్: టీటీడీ స్థానిక ఆలయాలైన శ్రీగోవిందరాజ స్వామి, శ్రీకోదండరామ స్వామివారి ఆలయాల్లో మంగళవారం సాయంత్రం ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో దీనికి ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజున ఈ ఆణివార ఆస్థానం పర్వదినాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు, వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తర్వాత వార్షిక బడ్జెట్‌ను మార్చి–ఏప్రిల్ నెలాఖరుకు మార్పు చేశారు. ఇందులో భాగంగా శ్రీగోవిందరాజస్వామి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారిని వేంచేపు చేసి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా పుండరీక వల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

శ్రీకోదండరామాలయంలో...

శ్రీకోదండరామాలయంలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆలయంలోని గరుడాళ్వార్ ఎదురుగా శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ప్రత్యేకంగా ఆస్థానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ సోమశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


శ్రీపుండరీక వల్లి అమ్మవారి ఆలయం నుంచి శ్రీగోవిందరాజస్వామికి పట్టువస్త్రాలు ఊరేగింపు

మాతాశిశు సంరక్షణ చర్యలు పాటించాలి


వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు


గర్భిణీలతో మాట్లాడుతున్న జిల్లా వైద్య టాస్క్‌ఫోర్స్ బృందం

తిరుపతి మంగళం: వైద్య సిబ్బంది వారి పరిధిలో మాతాశిశు సంరక్షణ చర్యలను కచ్చితంగా పాటించాలని, గర్భిణీలకు మాతాశిశు సంరక్షణ కార్డులను తప్పనిసరిగా ఇవ్వాలని డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీ హెల్త్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీల రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణీలతో నేరుగా ముఖాముఖి నిర్వహించి వారు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణీలకు అందించే మాతాశిశు సంరక్షణ కార్డులలో వారికి ప్రభుత్వం అందించే సేవలను తప్పనిసరిగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు గణాంకాధికారి సి.నాగేంద్ర కుమార్, డీపీహెచ్‌ఎన్ఓ ఎ.బేబీ రాణి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ప్రకాష్, మంగళం పిహెచ్‌సీ వైద్యాధికారి జయంతి, సీహెచ్‌ఓ అమరావతి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు విశేష స్పందన

చంద్రగిరి: తిరుపతి స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం కొటాల పీహెచ్‌సీ పరిధిలోని మల్లయ్యపల్లి, మండపంపల్లిలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేష సంఖ్యలో విచ్చేసి, ఈ పరీక్షలు చేయించుకున్నారు. తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా సాగుతోంది. ఇందులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ గుర్తించేందుకు మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తించేందుకు పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సర్పంచ్ గౌతమి, చంద్రగిరి పీహెచ్‌సీ మెడికల్ అధికారులు డాక్టర్ కుసుమ, ప్రియాంక, స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ అధికారులు డాక్టర్ డి.పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, పంచాయితీ కార్యదర్శి స్వాతి, రేడియాలజిస్టులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మల్లయ్యపల్లిలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహించిన స్విమ్స్ అధికారులు